


సప్త కవితా సంకలనం | రచయితలు - శ్వేత కిరణాలు

# హరివిల్లు

హరివిల్లు – సప్తవర్ణాల మేలు కలయిక

ఇంధ్రధనస్సుగా పేరు గాంచెను

ఆ హరివిల్లుని చూసినంతనే ఎన్నో భావాలు, ఆ భావాల కలయికే ఈ రచన.

ఇది సప్తభావాల కలయిక కాదు

సప్తాశ్వాలపై ఊరేగు సూరీడి రథము కాదు

ప్రకృతిని చూచి పరవశించిన మా ఉప్పొంగుభావాల కలబోత

- ప్రదీప్

సప్తసాగర మథనాలు, సప్తస్వరాల ఆలాపనలు,

సప్తర్షిమండల సాధనలు, సప్తవర్ణ స్వప్నాలు

అన్నీ ఈ ఏడురంగుల హరివిల్లున దర్శించాము. ధన్యజీవులమైనాము

- ఉష

వాననీటిచుక్క నుదుటిపై కదలాడే నూనె బొట్టుని

ఉధృతమై జాలువారే ఆకాశగంగ కట్టే చీరకు పవిటంచుని

పొగమంచు రాత్రి రాజ్యంలో కాగడరాజుకు కిరీటాన్ని

రవివర్మకు హస్తభూషణాన్నీ, కవిచంద్రులకు ఇష్టసఖిని

మయూరాల పాదాభివందనమందుకునే నటరాణిని

చందమామ పీడకలల భయంలో అతడికి శ్రీరామ రక్షకవచాన్ని

సంధ్య నింగి పలకపైన మేఘాలకుంచె వేసిన బొమ్మని

విష్ణుచక్ర విలువలో సగభాగాన్నీ, ఆ హరి విల్లుని

ఎండవాన సంగమానికి మరులు పెంచే మధురరతిని

నీలాంటి వారెందరికో మరువలేని వదలలేని మధురానుభూతిని

నేనే ఇంధ్రధనస్సుని!!!

- ఆనంద్

## సప్త కవితా సంకలనం

# హరివిల్లు

ప్రేమ కలయిక ........ 4
అష్ట నాయికలు ........ 5
ద్రౌపదీ స్వయంవరం ........ 6
గిరిజా కళ్యాణం ........ 7
చిన్నబోయిందా నలుపు ........ 9
హరివిల్లు భువిలో దాగినదేమో? ........ 10
దొంగలు వేసిన హరివిల్లు ........ 12
శ్వేతం, రంగుల ఆవిష్కారమా ........ 13

## ప్రేమ కలయిక

ప్రదీప్

శ్వేతకిరణం ప్రియుడు

హిమబిందువు ఆ ప్రేయసి

ఇద్దరూ కలిసిన క్షణం ఆవిష్కృతం కాదా అందాల హరివిల్లు

వారి కలయికలో ఆ ఒక్క క్షణంలో ఎన్నో భావాలు పొంగవా

ఆ భావాలే సప్తవర్ణాలై ప్రతిబింబించవా

ఇద్దరూ తమ గుప్పెడంత గుండెలో దాచిన ఆవేశం ఎరుపై పొంగదా

తీపిపులుపుల మేలు కలయికను దాచిన నారింజరంగు కాదా వారి జంట,

అర్ధనారీశ్వరపు అందమే కాదా ఆ కలయిక

ఆ రంగుని చూసినంతనే ఆవర్ణం కాదా చూచెడి వారి మది

నీలాకాశమంత విశాలమే వారి ప్రేమ ,

నీలాకశమందున్న శూన్యమే వారి దూరం ,

ఆ ప్రేమ నీలవర్ణమై నిండదా

ఆమె కనులే నీలికలువలు కావా,

ఆ నీలికలువులు అతని చూచి ఆనందంతో వికసించలేదా,

ఆ నీలికలువలతో నింగిని నింపలేదా

అతను శ్యామవర్ణ సుందరాంగుడికి సాటి కాదా

అతనిలో పొంగిన ఆనందహేల శ్యామవర్ణమై ముంచెత్తలేదా

వారి జీవనానికి పచ్చతోరణాలు కట్టదా ఆకుపచ్చ వర్ణం

ఆ వన్నెల వర్ణము కనినంతనే చేరదా ఆహ్లాదం

మంగళకరమౌ వారి జీవనం, పసుపుబట్టలు కట్టలేదా ఆ జంట

అందమే ఇక వారి జీవనయానం

## హరివిల్లు

ఇంతలో ఏమాయె, ఆ హరివిల్లు అదృశ్యమాయె

శ్వేత కిరణపు ప్రియుడే దోబూచులాడెనా ?

హిమబిందువంటి ప్రేయసే అలిగి నేలపొరలలో దాగె నా?

మళ్ళీ ఆ హరివిల్లు కనిపించేదానేడో ?

# అష్ట నాయికలు

ప్రదీప్

కన్నెల మానసచోరుడు కన్నయ్య వేణుగానము వినినంత

ప్రేమతెమ్మెరల మోసుకుని వాయువులు వీచగా

విరహమునున్న శ్వేతవర్ణపు నాయిక రుక్మిణియే

సప్తవర్ణాల నాయికల ముందుకు నడిపించెనా

లేక వారితో కలిసి తానే పరుగిడెనా ?

ఆ అష్టనాయికల పయనం ఆ వేణువు చెంతకే

ఆ వేణువు చెంత చేరినంతనే ఆ మురళీధరుని కంఠమాలలాయిరా ?

అందమైన హరివిల్లుగా చూపులు దోచితిరా ?

ఆ వేణుగానమాగినంతనే అష్టనాయికలూ ఒక్కరై

శ్వేతవర్ణపు నాయికై మురళీధరుని చేత వెన్నంటి రుక్మిణిగా మి గిలిరా ?

# ద్రౌపదీ స్వయంవరం

ప్రదీప్

---

మీనములే ఆమె కన్నులా?
శ్వేతవర్ణపు సౌందర్యవతా ఆమె ?
ఆమె ద్రుపదరాజపుత్రి ద్రౌపదే కదా
సిగ్గులమొగ్గై స్వయంవర సభను చేరె

పాండవ మధ్యముడు అర్జునుడు ఆమెను చేపట్ట సభను చేరె
నేలపై వంగి, కన్నులు కిందకు దింపి
మేఘనాథుని ప్రార్థించ, దీవెనలు వర్షపు జల్లులై దీవించ
గోపయ్య చల్లని చూపులు ఆశీస్సుల కిరణాలై అచట ప్రసరించ

ఆ సవ్యసాచి చేత చేరె "ఇంద్రధనస్సు"
ఆ ధనస్సు గురి మీనముల కన్నులు కాదేమో
అసలు గురి మీనములే కన్నుల నింపి చూచుచున్న ద్రౌపదేమో
ఆతని బాణం గురి తప్పక ఆమె కంఠసీమను అలంకరించె వివాహ హారమై

# గిరిజా కళ్యాణం

ప్రదీప్

శ్వేతశిఖరాలపై ధ్యానముద్రన మునిగి ఉన్నాడు ఆ శంకరుడు
శివుడు బాధలోనున్నాడేమో ప్రకృతి కూడా నిర్వేదంగా ఉంది,
ఆ నిర్వేదపు శిశిర ప్రకృతికి ఏకైక శోభ ఆమె, పార్వతి
ఆ శంకరుడు కొలువున్నది ఆ పార్వతి హృదయశిఖరాలపైనేమో

ఆమె హృదయమున ఏనాడో ఆసీనుడాయెను ఆ శంకరుడు
అది తెలియని వేల కాదే ఆ పార్వతి,
వారి వివాహసమయం కోసమే కాదా ఆ నిర్వేదపు ప్రకృతి ఎదురుచూపులు
అదీ తెలుసు ఆ పార్వతికి...

ఆ ధ్యానముద్రను కదలించ శివుని కంఠమున దాగిన గరళం
మూడోకన్నున వెలువడునని తెలియునే
తెలిసిననూ ముందుకు సాగెను మన్మధుడు వారించు రతీదేవిని తోడ్కొని
మన్మధునికి ఆ ధైర్యమేలనో.... విధి నిర్వహణను నమ్మిన యోగేమో ఆతడు

కోయిలలచే కూయించెను, మల్లెల సువాసనలు వెదజల్లెను
సుందరీమణులతో నాట్యము చేయించెను
ఎన్ని యత్నములనైనూ చెక్కుచెదరలేదు ఆ శంకరుడు

బ్రహ్మాస్త్రమో మరేమో, ఆ హరిని ప్రార్ధించి "హరివిల్లు" ను ఎక్కుపెట్టె
శ్వేతశిఖరపు మంచుని కరిగించి
శ్వేతశిఖరపు సిగలో అందమైన ఒక చిత్తరువు గీచెను
ఆ చిత్తరవు గీచినంతనే ధ్యానముద్రను వీడెను ఆ శంకరుడు

# హరివిల్లు

భస్మీపటలమాయెను మన్మధుడు,

భస్మమాయినది మన్మధుడు కాదేమో?

శ్వేతశిఖరముపై  హరివిల్లుని కనిన అనిర్వచనీయ అనుభూతిన

బూడిదయ్యినది కామమేమో ?

రతీదేవి దు:ఖమును తీర్చ ఆమెకు ప్రసాదించే తన ధ్యానసాధన

శ్వేతశిఖరమున హరివిల్లు కనిన క్షణం ఒక జంట కలిసె ,

మరొక జంట ధ్యానముద్రన  మునిగె

ఆ జంటను కలిపెడివాడు మన్మధుని పంపిన హరే కదా

ఈ జగన్నాటకసూత్రధారే   కాదా ఆ నల్లనయ్య

# చిన్నబోయిందా నలుపు

ప్రదీప్

---

భానుని శ్వేతకిరణాలు తండవమాడుచున్న వేళ, ఒక చినుకు కురిసె

చినుకు తడికి తడిసి, మురిసి శ్వేతకిరణం ఏడు వర్ణములలో వన్నెలు పోసాగింది ,

ఆ సప్త వర్ణాలూ తమ వన్నెలతో శ్వేతకిరణ సుందరికి అలంకారములవ్వగా

తన నెచ్చెలి తామసి తోడు లేక చిన్నబోయెనా నలుపు

తన అంశలగు సప్తవర్ణముల వన్నెలు చూస్తూ ఆనందమొందుచున్నదా శ్వేత సుందరి

ఆ వన్నెల నృత్యస్థలి ఆ నల్లనయ్య తలపైన దాగిన పింఛమే కాదా ?

చిన్నబోలేదులే నలుపు, తామసమునే జయించిన నల్లనయ్య తోడుండగా

ఆ నల్లనయ్యకే అలంకారమై నిలువగా

శ్వేత సుందరి అలగదులే

ఆ నల్లనయ్య చేత వెన్నముద్ద కదా ఆ శ్వేతసుందరి ,

ఒక చేత మురళి, మరు చేత వెన్నముద్ద

దేహము నలుపు, శిరముపై హరివిల్లును చూపించు పింఛము

అన్ని వర్ణములూ కలిసిన ఆ క్షణము నా వర్ణనలకు లొంగునా ?

భానుడే మనమేమో

ఆ చినుకులే సత్యాసత్యాలేమో

శ్వేతకిరణాలు మనలోని భావనలేమో

ఆ రెండూ కలసిన క్షణమున వచ్చేడిది హరివిల్లంటి ఆత్మసాక్షాత్కారమేమో

తామసమును జయించి తామసి నెచ్చెలిని మన అలంకారముగా చేసుకుంటే

వేడి వేడి భావనలు వెన్నంత చల్లగా అవుతాయేమో

ఆ క్షణమున మనిషే ఆ నల్లనయ్య అవునేమో

# హరివిల్లు భువిలో దాగినదేమో?

ఉష

ఏడేడు సంద్రాల తప్పటడుగేసి ఎదిగినాం

సంద్రాల పడవల్ల తప్ప తాగి సిందేసినాం

ఎన్నెల్లో చేపలల్లే వలపు సయ్యాటలాడినాం

పొద్దు చూసి నీలి మబ్బు కళ్ళాపి జల్లినాం

పుట్టి గిట్టినాక అంతా నాకు అతిధులే

ఒడ్డూబారు కొలవను ఆరడుల గొయ్యి తీస్తాను

కాదు కూడదంటే చితిమంట పేర్చేస్తాను

శవవేడుక సంబరాల ఎర్రెర్రని నెగడు పెట్టేస్తా ను

పైరు నాకు బహు పసందు, పంట కూడ మంచి విందు

పచ్చ కామెర్ల రోగికన్నా నేను నయం

పచ్చనాకే పట్టుకుంటా, విడవకుండా స్వాహా చేస్తా

పచ్చ గొంగళని ఛీత్కరించినా నాకన్నా ఎవరు హెచ్చు?

రాళ్ళలో రప్పల్లో కాపురముంటా

మనిషి జాతికి వెరచి పారిపోతా

వెంటాడితే మటుకు ఎదురొస్తా

తోకతోనే శాస్తిచేస్తా పసుపువన్నె నా విషం అద్ది

పూలన్నీ సువాసనిస్తాయా, మాలో ఒకరం బైరాగి కామా?

# హరివిల్లు

నా వన్నెలు చూసి మల్లెలు సిగ్గుపడవా!

నా సోయగాన మరువం మౌనం వహించదా?

పేరులోనే రంగు దాచిన కనకాంబరం నేను కానా!

మాగాణి గట్టున రావి వేపకి పెళ్ళంట

రాగాలు పలుకగ నాకు పిలుపంట

వూరేగి తూరేగి వెర్రెక్కి పాడంగ

నా పాలపిట్ట వన్నె పులకించెనంట

వంగతోట కాడ ముల్లని మావ గోటికి నా వంత

మనసుపడి మనువాడిన వాడికి నేనె కానా వంట

కూరా నారా లేనివాడికీ నేకానా కారు చౌక

వూదా రంగు వెదకనేల నే నెదురుగ వుండ?

హరివిల్లిలా దేవలోకం విడిచి భువిని దాగదా పలు రూపాలై?

# దొంగలు వేసిన హరివిల్లు

ఉష

చీరల దొంగ చెట్టు దాపు చాలదని

విను వీధిన పరుగిడాట

వాన మబ్బు ఫక్కుమని నవ్వే

అది చూసి సూరీడు తొంగి చూసే

సిగ్గుపడ్డ చిన్ని కన్నయ్య

సప్తవర్ణ వస్త్రాలు విసిరిపారవైచే

ఆ వంక మొదలు ఆ వంక వరకు

ఏడేడు రంగుల హరివిల్లు విరిసే

ఆకతాయి అబ్బాయి వర్షైన మరదలి

మోముగిల్లి మంచె మీదకు మళ్ళిస్తే

పచ్చనాకు పందిళ్ళు వేసే

తంగేడు పసుపు నలుగు పెట్టే

తమలపాకు సిగ్గెరుపుకు సవాలు విసిరింది

సిగ నలుపుకి తన తెలుపు అద్దింది కలువ

నీలి మబ్బు చిన్నబోయి కాషాయం కట్టుకునే

సప్త వర్ణాల హరివిల్లు ఆ చెలిమిలో బింబించే

# శ్వేతం, రంగుల ఆవిష్కారమా

ఉష

సప్త వర్ణాల మిళితం శ్వేతం
నలుపు అన్ని వర్ణాల సమ్మేళనం
తెలుపు నవ్వితే రంగులన్నీ తేటతెల్లం
నలుపు వొలికితే వర్ణాలన్నీ మటుమాయం

ఆది పరాశక్తి మేని వన్నె శ్వేతం
విశ్వశాంతికి చిహ్నం శ్వేత పతాకం
సంకీర్ణ వర్ణాల మేఘం రువ్వు శ్వేతకాంతి
శాంతికి, శక్తికి మూలం శ్వేతక్రాంతి

పసిపాప నవ్వు శ్వేతం ఆ కంటి నీరు నీలం
చెంగల్వ తెలుపు చిన్ని కృష్ణయ్య నలుపు
సీతమ్మోరి పూబంతి తెలుపు, చేత బట్టిన రామయ్య నలుపు
ఆ వన్నె ఈ వన్నె నడుమ నడిచేది జీవితం

మల్లీ జాజి తెలుపు, జగమంతా మరులు గొలుపు
మంచి మనసు తెలుపు, తన మాటది గెలుపు
తెలుపు దాచిన రంగులు, నలుపు దోచిన రంగులు
వెలికి తెచ్చేటి రంగుల కలలు నిత్య జీవితానికి శ్వాసనిశ్వాసలు